

కొండపై వేడుకలు

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామి సన్నిధిలో బుధవారం తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకలు నిర్వహించారు.



రాజన్న సన్నిధిలో హోమాలు

వేములవాడ: ఆధ్యాత్మిక దినోత్సవంలో భాగంగా బుధవారం ఎములాడ రాజన్న ఆలయంలో ప్రత్యేక హోమాలు చేశారు.

గరిష్టం/కనిష్టం
39.0/28.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. కొన్నిచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కొండగట్టు ఆలయ పునర్నిర్మాణానికి డిజైన్



డిజైన్ సిద్ధం చేస్తున్న ఆర్కిటెక్ట్ ఆనందసాయి

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆర్కిటెక్చర్ ఆనందసాయి వివిధ డిజైన్లు రూపొందిస్తున్నారు. వీటికి సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. మొత్తంగా ఆలయ పునర్నిర్మాణానికి సంబంధించిన మ్యాప్ త్వరలోనే పూర్తికానున్నట్లు సమాచారం.

రౌడీషీటర్ల కదలికలపై నిఘా



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ నటేశ్

జగిత్యాలక్రైం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో వ్యవహరించాలని పట్టణ సీఐ నటేశ్ సూచించారు. బుధవారం పట్టణానికి చెందిన రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసు నిఘా ఉంచుతుందని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, ప్రజలను బెదిరించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సంజీవ్, అబ్దుల్ రహీం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మనసు, ఆత్మను ఏకం చేసేదే యోగా



యోగా సాధన చేస్తున్న భోగ శ్రావణి తదితరులు

జగిత్యాలటౌన్: మనసు, ఆత్మ, శరీరాన్ని ఏకం చేసే ప్రక్రియ యోగా సాధన అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. స్థానిక వివేకానంద మినీస్టేడియం, గీతా విద్యాలయంలో బుధవారం జరిగిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ఆమె యోగా సాధన చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధక్షుడు పైడిపల్లి సత్యనారాయణరావు, పట్టణ అధ్యక్షుడు వీరబత్తిని అనిల్‌కుమార్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

యూనిట్లతో స్వయం ఉపాధి



క్లాత్ సెంటర్‌ను పరిశీలిస్తున్న గంగాధర్

జగిత్యాలరూరల్: మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో స్వయం ఉపాధి పొందాలని ఐకేపీ ఏపీఎం గంగాధర్ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో ఏర్పాటు చేసిన యూనిట్లను బుధవారం ఆయన పరిశీలించారు. మహిళా సంఘాలు బ్యాంక్ లింకేజీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆదాయాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు పేదరిక నిర్మూలన సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎల్ల గంగనర్సు, సీసీ గంగారాం, వీవోఏ స్వప్న, వి.లౌక్య పాల్గొన్నారు.

23న ఒలింపిక్ డే రన్

జగిత్యాలటౌన్: జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న నిర్వహించనున్న ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి నరేశ్ బుధవారం కోరారు. ఉదయం 6గంటలకు మినీస్టేడియం నుంచి మున్సిపల్ పార్క్ వరకు ఒలింపిక్ డే రన్ నిర్వహిస్తామన్నారు. అసోసియేషన్ బాధ్యులు, క్రీడా, వ్యాయామ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

అధికారులు బిజీ

- సిద్ధమైన ఓటరు జాబితా
- జిల్లా ఓటర్ల సంఖ్య 6,48,050
- ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలు 785
- త్వరలో ఆర్వో, ఏఆర్వో, అధికారులకు శిక్షణ



జగిత్యాలలోని ఓ పోలింగ్ కేంద్రంలో భద్రతా ఏర్పాట్లు, సౌకర్యాలపై ఆరా తీస్తున్న పోలీసులు

జగిత్యాలరూరల్: జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. త్వరలోనే శాసనసభ ఎన్నికలు నిర్వహిస్తారనే ఉన్నతాధికారుల ఆదేశాలతో రంగంలోకి దిగిన జిల్లా అధికారులు.. ఓటరు జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఉద్యోగులు, సిబ్బందికి విధులు, బాధ్యతల అప్పగింత, శిక్షణతోపాటు ఇతర సాంకేతికపరమైన ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు.

మూడు నియోజకవర్గాలు..

- జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల కోసం ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేశారు.
- ఈ ఏడాది జనవరి 5వ తేదీన ముద్రించిన ఓటరు జాబితా ఆధారంగానే ఎన్నికలు నిర్వహిస్తామని అధికార యంత్రాంగంలిప్పటికే ప్రకటించింది.
- ఇందుకు అవసరమైన ఏర్పాట్లను శరవేగంగా చేపడుతోంది.

221 మంది ప్రభుత్వ ఉద్యోగ ఓటర్లు

- జిల్లావ్యాప్తంగా వివిధ విభాగాల్లోని ప్రభుత్వ ఉద్యోగ ఓటర్లు మొత్తం 221మంది ఉన్నట్లు జిల్లా అధికారులు గుర్తించారు. జగిత్యాల నియోజకవర్గంలో 43 మంది, కోరుట్ల నియోజకవర్గంలో 47 మంది, ధర్మపురి నియోజకవర్గంలో 131 మంది ఉద్యోగ ఓటర్లు ఉన్నట్లు వారు వివరించారు.

ఇతరులు 17మంది..

జిల్లాలో ఇతర ఓటర్లు మొత్తం 17మంది ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. జగిత్యాల నియోజకవర్గంలో 15మంది ఉండగా, ధర్మపురి నియోజకవర్గంలో మరో ఇద్దరు ఇతర ఓటర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	మొత్తం ఓటర్లు	పురుషులు	మహిళలు	ఇతరులు
జగిత్యాల	254	2,13,287	1,03,419	1,09,853	15
కోరుట్ల	262	2,23,867	1,07,331	1,16,536	0
ధర్మపురి	269	2,10,896	1,03,826	1,07,068	2

ఇతర నియోజకవర్గాల్లో నాలుగు మండలాలు..

జిల్లాల పునర్విభజనలో భాగంగా జిల్లాలో ఉన్న నాలుగు మండలాలు ఇతర నియోజకవర్గాల పరిధిలోకి వెళ్లాయి. మల్యాల, కొడిమ్యాల మండలాలు చొప్పదండి నియోజకవర్గంలో ఉండగా, వేములవాడ నియోజకవర్గంలో మేడిపల్లి, కథలాపూర్ మండలాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన ఏర్పాట్లను ఇతర జిల్లాల్లోని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరోవైపు.. పెద్దపల్లి జిల్లాలోని ధర్మారం మండలం ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోకి వస్తోంది. అక్కడి ఓటరు జాబితా, ఎన్నికల ఏర్పాట్లను ఆ జిల్లా అధికారులు సిద్ధం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపు..

జిల్లా వ్యాప్తంగా మూడు నియోజకవర్గాల్లో 785 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ప్రతీ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి ఎంపిక చేశారు. ప్రధానంగా విద్యుత్ సరఫరా, తాగునీటి వసతి, ర్యాంపుల ఏర్పాటు, ఇతర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల జాబితా నివేదికను జిల్లా ఉన్నాధికారులు ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు సమర్పించారు.

త్వరలోనే శిక్షణ..

శాసనసభ ఎన్నికల కోసం కేంద్రఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల ప్రకారం ఇప్పటికే ఓటరు జాబితా సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను కూడా సిద్ధం చేశారు. త్వరలోనే ఆర్వో, ఏఆర్వో, పోలింగ్ అధికారులు, సిబ్బందికి జిల్లాస్థాయి, మండలస్థాయిలో శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆధ్యాత్మికతతో భక్తిభావం



సామూహిక సత్యనారాయణస్వామి వ్రత పూజల్లో భక్తులు

- సాంఘీ సంక్షేమ మంత్రి కొప్పుల ఈశ్వర్
- నృసింహుని సన్నిధిలో ఆధ్యాత్మిక దినోత్సవం

ధర్మపురి: ఆధ్యాత్మికత ఉత్సవాల్లో పాల్గొంటే ప్రజల్లో భక్తిభావం పెంపొందుతుందని సాంఘి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో బుధవారం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో 150 జంటలతో శ్రీరామ సహిత సామూహిక సత్యనారాయణ వ్రత పూజలు కన్నులపండువగా నిర్వహించారు. మంత్రి కొప్పుల ఈశ్వర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. తొమ్మిదేళ్ల సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించిందని, అందుకే వివిధ రంగాలకు చెందిన వేడుకలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని 24 దేవాలయాలను ధూపదీప నైవేద్యం కింద ఎంపిక చేయగా, వాటి ఉత్తర్వు ప్రతులను ఆలయ పూజారులకు మంత్రి అందజేశారు.



పూజల్లో మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు

నాగమయ్య ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ..

స్థానిక నంది కూడలి సమీప పురాతనమైన నాగమయ్య ఆలయ పునర్నిర్మాణానికి మంత్రి కొప్పుల ఈశ్వర్ ఇటీవల రూ.12 లక్షలు మంజూరు చేయించారు. ఆ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, అడిషనల్ కలెక్టర్ మకరంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీపీ జెడ్పీటీసీలు చిట్టిబాబు, బత్తిని అరుణ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, రేనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, మున్సిపల్ కమిషనర్ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అమరుల సంస్మరణ దినోత్సవం

జగిత్యాల: జిల్లాల్లో గురువారం అమరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆమె మాట్లాడారు. అన్ని జిల్లాల్లో అమరువీరుల కుటుంబాలను ఘనంగా సన్మానించాలన్నారు. గ్రామాల్లోని అమరవీరుల స్తూపాల వద్ద శ్రద్ధాంజలి ఘటించాలని చెప్పారు. ప్రతీగ్రామంలో ఉదయం 11 గంటలకు సమావేశమై ఈ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. మున్సిపాలిటీలు, మండల పరిషత్‌లు, కార్పొరేషన్లు, జిల్లా పరిషత్‌లలో అమరులకు ఘనంగా నివాళి అర్పించాలని పేర్కొన్నారు. కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ, అమరుల సంస్మరణ దినోత్సవం కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లత, మకరంద్, డీఈవో జగన్మోహన్‌రెడ్డి, డీఆర్డీవో లక్ష్మీనారాయణ, డీపీవో దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి పెట్టండి

- డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు

సారంగాపూర్(జగిత్యాల): ప్రస్తుత పరిస్థితుల్లో యోగా సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డీఎఫ్‌వో వెంకటేశ్వర్‌రావు, డీఆర్డీవో లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక అటవీప్రాంతంలోని బతుకమ్మకుంట వద్ద బుధవారం యోగా దినోత్సవం నిర్వహించారు. తొలుత యోగా సాధన చేశాక వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జైలులో యోగా దినోత్సవం

జగిత్యాలజోన్: స్థానిక స్పెషల్ సబ్ జైలులో బుధవారం యోగా దినోత్సవం నిర్వహించారు. ఖైదీలతోపాటు జైలు సిబ్బంది యోగాసనాలు వేశారు. యోగాసనాల ప్రాముఖ్యతపై అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో జైలర్ మొగిలేశ్, హెడ్ వార్డర్ మజారొద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా సాధనలో ఖైదీలు, సిబ్బంది

జయశంకర్ సార్ ఆశయాలు నెరవేరుస్తున్నాం

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలజోన్: ప్రొఫెసర్ జయశంకర్ సార్ కలలు, ఆశయాలను తెలంగాణ ప్రభుత్వం నెరవేరుస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. స్థానిక జెడ్పీ కార్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమం కోసం నిరంతరం తపించిన గొప్ప త్యాగమూర్తి ప్రొఫెసర్ జయశంకర్ సార్ అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నాగం భూమయ్య, సీఈవో రామానుజాచారి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

కేసీఆర్‌తోనే తెలంగాణ సాధ్యమని నమ్మారు..

జగిత్యాలటౌన్: తెలంగాణ ఏర్పాటు కేసీఆర్‌తోనే సాధ్యమని నమ్మిన ప్రొఫెసర్ జయశంకర్ సార్.. మలిదశ ఉద్యమంలో ఆయన వెంటే నిలిచారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల వద్ద ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతి నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జయశంకర్‌సార్.. తెలంగాణ ఆవిర్భావాన్ని చూడకుండానే కన్నుమూయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బల్దియా చైర్‌పర్సన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, కూసరి అనిల్, పిట్ట ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రత

- నాలాల్లో సోఫాలు, పరుపులు వేయడం సరికాదు
- మున్సిపాలిటీల్లో స్వచ్ఛ బడికి రూ.79 కోట్లు
- తీగల వంతెన-మానకొండూరు లైటింగ్‌కు రూ.20 కోట్లు
- కరీంనగర్ అభివృద్ధిపై మంత్రి కేటీఆర్ ప్రశంసల వర్షం
- దసరాకు రివర్ ఫ్రంట్‌పై బతుకమ్మ ఆటలు : మంత్రి గంగుల



మాట్లాడుతున్న మంత్రి కె.తారక రామారావు, వేదికపై మంత్రి గంగుల కమలాకర్ తదితరులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్ కార్పొరేషన్/కరీంనగర్: ప్రజాభాగస్వామ్యంతోనే నగరాల్లో పరిశుభ్రత సాధ్యమని పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. బుధవారం కరీంనగర్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్మించిన కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. నాలాలు శుభ్రం చేస్తుంటే సోఫాలు, పరుపులు, కుర్చీలు వస్తున్నాయని, ఈ తీరు మారాలని సూచించారు. సిద్దిపేట స్ఫూర్తిగా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో స్వచ్ఛబడి ఏర్పాటు చేయాలని ఆదేశించామని, ఇందుకు రూ.79 కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. తడి చెత్త నుంచి ఎరువు తయారు చేస్తూ హైదరాబాద్ నగరం ఏటా రూ.200 కోట్లు, సిరిసిల్లలో స్వశక్తి సంఘాలు నెలకు రూ.8 లక్షలు సంపాదిస్తున్నాయని వివరించారు. సిద్దిపేటలో దీప్తి అనే కౌన్సిలర్ స్వచ్ఛబడి నిర్వహిస్తోందని, అలా ఇతర కార్పొరేటర్లు ప్రయత్నించాలని సూచించారు. తాను జపాన్ వెళ్లినప్పుడు పరిసరాలు శుభ్రంగా ఉండడంపై ఆరా తీయగా.. తాము అపరిశుభ్రం చేయకపోవడమే కారణమని అక్కడి ప్రజలు చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. సఫాయి మిత్ర సురక్షలో దేశంలోనే కరీంనగర్‌కు మొదటి స్థానం రావాల్సి ఉన్నా.. కుట్రతోనే ఆ స్థానం గుజరాత్‌కు వెళ్లిందని పేర్కొన్నారు.

నేను పుట్టింది కరీంనగర్‌లోనే..

కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కేటీఆర్ సూచించారు. తొమ్మిదేళ్లలో నగరం ఎలా మారిందో ప్రజలు చూస్తున్నారన్నారు. 1976లో తాను ఇక్కడి మిషన్ హాస్పిటల్‌లో జన్మించానని, కరీంనగర్, ఎల్ఎండీలో మూడునాలుగేళ్లు చదివానని గుర్తు చేశారు. నగరంలో పర్యటించినప్పుడు అంతర్గత రోడ్లు చూశానని, చాలా బాగున్నాయని అభినందించారు. రూ.225 కోట్లతో కేబుల్ బ్రిడ్జిని ప్రారంభించుకున్నామని, రూ.480 కోట్లతో నిర్మిస్తున్న రివర్‌ఫ్రంట్ పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. మూడు నాలుగు నెలల్లో రివర్‌ఫ్రంట్ పూర్తయ్యాక ప్రజలు ఆశ్చర్యపోయే స్థాయికి కరీంనగర్ చేరుతుందన్నారు. వచ్చే సెప్టెంబర్ నాటికి హౌసింగ్‌బోర్డుకాలనీలో 24 గంటల నీళ్లిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సిస్టం ఏర్పాటు చేసుకున్న తొలినగరం కరీంనగర్ అని తెలిపారు. కౌన్సిల్ హాల్ అసెంబ్లీ హాల్‌లాగా ఉందని ప్రశంసించారు. టీవీల్లో కనిపించాలన్న ఆత్రంతో కొందరు కౌన్సిలర్లు, కార్పొరేటర్లు దిగజారి దూషణలకు దిగుతున్నారని, అందుకే కౌన్సిల్ మీటింగ్‌కు మీడియాను అనుమతించొద్దన్నానని స్పష్టంచేశారు.

లైటింగ్ కోసం రూ.20 కోట్లు

సాయంత్రం మానేరు తీరాన తీగల వంతెన ప్రారంభించిన అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. తీగల వంతెన నుంచి మానకొండూరు వరకు లైటింగ్ కోసం మంత్రి గంగుల కమలాకర్ తనను కోరారని, వెంటనే రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో మానేరు రివర్ ఫ్రంట్ తొలిదశ పూర్తవుతుందన్నారు. శ్రీవేంకటేశ్వర ఆలయం, మెడికల్ కాలేజీలతో జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. వచ్చే దసరా నాటికి రివర్‌ఫ్రంట్‌పై నగర ఆడపడుచులు బతుకమ్మ ఆడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ప్రణాళికా సంఘం వైస్‌చైర్మన్ బి.వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. కరీంనగర్‌ను లండన్‌లా మారుస్తానన్న సీఎం కేసీఆర్ తన మాటలను నిజం చేసి చూపించారన్నారు. వచ్చేవారం సింగపూర్, సియోల్ నగరాలకు వెళ్లి పర్యటించి నగరానికి కావాల్సిన సదుపాయాలపై మంత్రి కేటీఆర్‌కు నివేదిక ఇస్తామని వెల్లడించారు. తీగల వంతెన ఆలోచనకు కారణమైన ఈఎన్‌సీ రవీందర్‌రావును ప్రశంసించారు.

ప్రైవేట్ రంగాల్లోనూ రాణించొచ్చు

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ప్రైవేట్ రంగంలోనూ రాణించొచ్చని మంత్రి కేటీఆర్ అన్నారు. రూ.7 కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో నిర్మిస్తున్న మోడ్రన్ లైబ్రరీ భవనానికి శంకుస్థాపన చేశారు. లైబ్రరీలో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ఇక్కడున్న వస్తువు భారతీయులది కాదని, విదేశీయుల వస్తువులు వాడే దుస్థితి మనకు ఉండొద్దని సూచించారు. ఉద్యోగాలు రాలేదని బాధపడొద్దని, మనమే ప్రపంచానికి కొత్త వస్తువులను అందించే స్థాయికి ఎదగాలని సూచించారు. భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా కష్టపడి చదవాలని, ప్రైవేట్ వ్యాపార రంగాలపైనా దృష్టి సారించాలన్నారు. గ్రంథాలయ ఐడీ కార్డును కేటీఆర్‌కు అందించారు. కార్యక్రమాల్లో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, జిల్లా కలెక్టర్ ఆర్వీ.కర్ణన్, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటన సాగిందిలా..

- రూ.10 కోట్లతో నిర్మించనున్న కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్, రూ.7కోట్లతో నిర్మించనున్న మోడ్రన్ లైబ్రరీ, నగరపాలక సంస్థ కార్యాలయంలో సిటిజన్ సర్వీస్ సెంటర్, నూతన సమావేశ మందిరం, ఆధునీకరించిన సమావేశమందిరం, కమాండ్ కంట్రోల్ సిస్టంను ప్రారంభించారు.
- కమాండ్ కంట్రోల్ గురించి వివరాలు తెలుసుకున్నారు.
- నూతన కౌన్సిల్ హాల్‌లో మేయర్ యాదగిరి సునీల్‌రావును సీటులో కూర్చొబెట్టి అభినందించారు.



హాజరైన అధికారులు, ప్రముఖులు



యువత కేరింతలు



ఆకట్టుకున్న కళాకారిణి నృత్య ప్రదర్శన

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలు కన్నుమూత


ఉత్కం గంగవ్వ (ఫైల్)

కథలాపూర్(వేములవాడ): భూషణరావుపేట గ్రామానికి చెందిన ఉత్కం గంగవ్వ(101) బుధవారం ఉదయం కన్నుమూసినట్లు గ్రామస్తులు తెలిపారు. గంగవ్వ మంగళవారం సాయంత్రం వరకు ఆరోగ్యంగానే ఉంది. తన పనులు తానే చేసుకుందని కుటుంబసభ్యులు పేర్కొన్నారు. వాడ ప్రజలతో ఏళ్లనాటి పరిస్థితులను వివరిస్తూ ముచ్చటించేదన్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి గంగవ్వ అస్వస్థతకు గురై బుధవారం ఉదయం మృతి చెందిందన్నారు. మృతురాలికి సుమారు 20 మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారని గ్రామస్తులు వివరించారు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు, ఉపసర్పంచ్ పల్లె సరిత, గడ్డం భూమరెడ్డి, గీత కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు.

యువకులపై అట్రాసిటీ కేసు

రాయికల్(జగిత్యాల): వస్తాపూర్ గ్రామానికి చెందిన పాలకుర్తి రాజేశ్, పాలకుర్తి శివ, చందు, జువ్వాజి అక్షయ్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజయ్ బుధవారం తెలిపారు. వస్తాపూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ వెంకటేశ్‌ను ఈ నలుగురు యువకులు కులం పేరుతో దూషించి కర్రలతో దాడి చేశారని బాధితులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు.

దాడి చేసిన వ్యక్తులపై..

జగిత్యాలక్రైం: పట్టణంలోని సర్దార్ సత్రం సమీప దాసరి హరీశ్‌కుమార్‌పై దాడిచేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సంజీవ్ బుధవారం తెలిపారు. జగిత్యాల రూరల్ మండలం కండ్లపల్లి గ్రామానికి చెందిన దాసరి హరీశ్‌కుమార్.. పట్టణంలోని మెడికల్ షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి మందులు తీసుకువచ్చేందుకు మెడికల్ ఏజెన్సీకి వెళ్తుండగా సర్దార్ సత్రం వద్ద చేని సంపత్, నితిన్, శ్రీనాథ్ అతడిని అడ్డగించి దాడిచేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

దొంగతనం కేసులో ఇద్దరికి ఆరు నెలల జైలు

సిరిసిల్లక్రైం: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేసిన దామ పవన్, మదిగాని రవీందర్‌లకు ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి హిమబిందు బుధవారం తీర్పునిచ్చారు. సిరిసిల్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 23వ తేదీన సిరిసిల్లలోని విశ్వనాథస్వామి ఆలయం హుండీ తాళం పగులగొట్టి దొంగతనం చేయడంతో పాటు ద్విచక్ర వాహనాలు ఎత్తుకెళ్లిన దామ పవన్‌తో పాటు రవీందర్‌లపై సీఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదే విధానంలో మార్చి నెలలోనూ పలు దొంగతనాలు జరుగడంతో పోలీసులు నిఘా ఏర్పాటు చేసి పట్టుకున్నారు. ఎస్సైలు శ్రీకాంత్, మారుతిలు కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా వాదోపవాదాల అనంతరం దొంగతనం చేసిన ఇరువురిపై నేరం నిరూపణ కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి

ఐదు రకాలుగా వర్గీకరణ

జగిత్యాలఅగ్రికల్చర్: రైతులు నాసిరకం విత్తనాలు నాటడం ద్వారా పంటకు పురుగులు, తెగుళ్లు ఆశించి దిగుబడులు తగ్గుతున్నాయి. దీంతో, రాత్రింబవళ్లు కష్టపడ్డా.. ఆశించిన ఆదాయం రాక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇందుకు నాణ్యమైన విత్తనం వాడకపోవడమేనని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అధిక జన్యు స్వచ్ఛత, అధిక మొలకశాతం కలిగి, తెగుళ్ల బారిన పడని, నాణ్యమైన విత్తనాన్ని వాడితే దిగుబడులు పెరుగుతాయని వివరిస్తున్నారు. ఇందులో న్యూక్లియస్, బ్రీడర్, ఫౌండేషన్, సర్టిఫైడ్, ట్రూత్‌ఫుల్ విత్తనం.. ఇలా ఐదు రకాలు ఉంటాయని పేర్కొంటున్నారు.

న్యూక్లియస్ రకం..

- ఈ విత్తనం రూపొందించిన శాస్త్రవేత్త స్వయంగా పరిశోధన స్థానంలో ఉత్పత్తి చేస్తారు. ఇలాంటి విత్తనం అతితక్కువ పరిమాణంలో ఉత్పత్తి అవుతుంది. ఈ విత్తనానికి జన్యు స్వచ్ఛత, భౌతిక స్వచ్ఛత నూటికి నూరుశాతం ఉంటుంది. విత్తనం అభివృద్ధికి ఈ రకమే మూలం, ప్రధానం.

బ్రీడర్..

- ఈ రకం విత్తనాన్ని రూపొందించిన శాస్త్రవేత్త సొంత పర్యవేక్షణలో ఆయా విశ్వవిద్యాలయాల పరిశోధన కేంద్రంలో మూలవిత్తనాన్ని పరిశోధించి బ్రీడర్ విత్తనం తయారు చేస్తారు. ఇది భౌతిక, జన్యు స్వచ్ఛత 99.9 శాతం ఉంటుంది. ఈ రకం విత్తనం సంచులకు బంగారు రంగు ట్యాగ్ వేస్తారు. ఇలాంటి విత్తనాన్ని విత్తనాభివృద్ధి కోసం జాతీయ, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థలు, ఇతర వ్యవసాయ పరిశోధన స్థానాలు, అభ్యుదయ రైతులకు అందిస్తారు.

ఫౌండేషన్ సీడ్..

- బ్రీడర్ విత్తనం నుంచి ఫౌండేషన్ విత్తనం తయారవుతుంది. బ్రీడర్ విత్తనం తక్కువగా ఉన్నప్పుడు విత్తనం దశ-1 నుంచి ఫౌండేషన్ విత్తనం దశ-2 తయారు చేస్తారు. ఈ రెండు రకాల విత్తనాల్ని రాష్ట్ర విత్తన ధ్రువీకరణ సంస్థ సర్టిఫై చేస్తుంది. ఈ రకం విత్తనాల్లో జన్యు స్వచ్ఛత 98-99 శాతం ఉంటుంది. ఈ విత్తనం సంచులకు తెలుపు రంగు ట్యాగ్ వేస్తారు.


పరిశోధన స్థానంలో విత్తనాలను ప్రాసెస్ చేస్తున్న సిబ్బంది

సర్టిఫైడ్ విత్తనం..

ఈ రకం విత్తనాన్ని ఫౌండేషన్ దశ-1 లేదా దశ-2 నుంచి తయారు చేస్తారు. దీని జన్యు స్వచ్ఛత 97-98 శాతం ఉంటుంది. విత్తన ధ్రువీకరణ సంస్థ వీటిని సర్టిఫై చేస్తుంది. ఈ విత్తన సంచులకు నీలిరంగు ట్యాగు వేస్తారు.

ట్రూత్‌ఫుల్ లేబుల్..

విత్తనోత్పత్తిదారులు విత్తన నాణ్యతా ప్రమాణాలు పాటించి, తమ సొంత బాధ్యతపై తయారు చేస్తారు. ఇలాంటి వాటి సంచులకు లేత ఆకుపచ్చ రంగు ట్యాగ్ వేస్తారు. విత్తన సంస్థపై నమ్మకంతో మాత్రమే కొనుగోలు చేయాలి. ఎక్కువగా రైతులు ఉపయోగించేది ఈ రకం విత్తనాలే.

నాణ్యమైన విత్తనం ఇలా తయారు..

విత్తనోత్పత్తి చేసే ప్రాంతాల్లో సరైన వాతావరణం ఉండేలా చూసుకుంటారు. సరిపోయేంత సూర్యరశ్మి, మధ్యస్థ వర్షపాతం, సాధారణ ఉష్ణోగ్రత కలిగిన ప్రాంతాల్లో విత్తనోత్పత్తి చేస్తారు. విత్తనోత్పత్తికి అంతకుముందు పంటకాలంలో అదేరకం వేసిన పొలం ఎంచుకోరు. దీనివల్ల, విత్తనాల్లో కల్తీ జరుగకుండా ఉంటుంది. నీటి సౌకర్యం ఉండటమే కాకుండా మురుగునీరు బయటకు పోయేలా చూసుకోవాలి. విత్తనోత్పత్తి చేసే పొలం చుట్టూ అదే పంటకు చెందిన వేరే రకం ఉంటే కనీస దూరం ఉండేలా చూసుకుంటారు. దీనికితోడు, మొగ్గదశ, పూతదశ, పంటకోతకు ముందు కల్తీ జరుగకుండా కలుపు మొక్కలు ఏరివేస్తారు. అలాగే, ఒకేహార్వెస్టర్ ద్వారా పంట కోయించి, తేమ శాతం బయటకు పోయేలా ఆరబెట్టి, ప్రాసెసింగ్ యంత్రాల ద్వారా శుభ్రపరిచి, సంచుల్లో ప్యాక్ చేస్తారు. ఇలా తయారు చేసిన విత్తనాలను ఆయా ధ్రువీకరణ సంస్థలు ప్రయోగశాలలకు పంపి భౌతిక స్వచ్ఛత, మొలకశాతం, జడ పదార్థం, తేమ శాతం, ఇతర పంటల విత్తనాలు, కలుపు విత్తనాలను పరీక్షిస్తారు. ఇండియన్ మినిమమ్ స్టాండర్స్ ప్రకారం ఉన్న విత్తనాలనే ప్రయోగశాలలు ధ్రువీకరిస్తాయి. తర్వాత, ఆయా విత్తనాన్ని బట్టి విత్తన సంచులకు ధ్రువీకరణ సంస్థలు ట్యాగ్‌లు ఇస్తాయి. అప్పుడే విత్తనాలను విత్తన సంస్థలు రైతులకు విక్రయించాలి.

నాణ్యమైన విత్తనాలతో లాభాలు



నాణ్యమైన విత్తనం జన్యు స్వచ్ఛత(మొలక శాతం) కలిగి ఉంటుంది. చీడపీడలు, తెగుళ్ల ప్రభావం తక్కువగా ఉంటుంది. ఎరువులు వాడితే ఇలాంటి విత్తనాల్లో మంచి దిగుబడులు వస్తాయి. పంట ఏకకాలంలో పూత, పరిపక్వతకు వస్తుంది. సాధారణ రకాలతో పోల్చితే 20-25 శాతం దిగుబడి అధికంగా ఉండే అవకాశం ఉంది. మార్కెట్‌లో కొంతఅధిక ధర కూడా వస్తుంది.
– డాక్టర్ లక్ష్మీప్రసన్న, వరి శాస్త్రవేత్త, పొలాస

ఇంటర్ టాపర్‌కు సన్మానం

కోరుట్ల: పట్టణానికి చెందిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఉమ్మేకుల్సుం ఇంటర్ హెచ్ఈసీలో 468 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. ఈ మేరకు విద్యాదినోత్సవం సందర్భంగా జగిత్యాల పట్టణంలో కలెక్టర్ యాస్మిన్ బాషా ఉత్తమ విద్యార్థి అవార్డును విద్యార్థినికి అందజేశారు. ఉమ్మేకుల్సుంను ప్రిన్సిపాల్‌తోపాటు పలువురు అభినందించారు.

రెండిళ్లలో చోరీ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): గోధూర్ గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి రెండు ఇళ్లలో చోరీ జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జాగిరి రవీందర్ ఎప్పటిలాగే ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి దాబాపై పడుకున్నారు. తాళాలు పగులగొట్టిన లోనికి ప్రవేశించిన దొంగలు.. అర్ధతులం కమ్మలు, బుట్టలు, రింగు, రూ.40వేల నగదు అపహరించారు. అలాగే తైదపల్లి లహరి తన ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లగా.. ఆ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని 10 గ్రాముల బంగారు ఆభరణం అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉమాసాగర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో..

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన పూదరి రాజవ్వ ఇంట్లో బుధవారం చోరీ జరిగింది. తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లో చొరబడి బీరువా ధ్వంసం చేశారు. అందులోని బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. తాటిపల్లికి చెందిన పూదరి రాజవ్వ బుధవారం ఇంటికి తాళం వేసి తన బంధువుల ఇంటికి వెళ్లింది. తిరిగి సాయంత్రం వచ్చేసరికి బీరువా పగులగొట్టి ఉంది. అందులోని సుమారు రూ.72,900 విలువైన బంగారు, వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

గ్రామస్తుల పోరాటానికి బీజేపీ మద్దతు

- ఇథనాల్ పరిశ్రమ రద్దు చేసేవరకూ ఉద్యమం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న బండి సంజయ్

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా రెండు గ్రామాల ప్రజలు చేస్తున్న పోరాటానికి తమ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతుగా తెలుపుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రకటించారు. ఆదిలాబాద్ జిల్లా లక్సెట్టిపేటలో జరిగే బహిరంగ సభకు వెళ్తూ మార్గమధ్యంలోని వెల్గటూర్ మండలం పాశిగామ స్టేజీ వద్ద ఆగారు. పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులు ఆయనతోపాటు పార్టీ నాయకుడు వివేక్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈసందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నా.. ఎక్కడా జనావాసాల మధ్య ఏర్పాటు చేయబోమన్నారు. మంత్రి అబద్ధపు ప్రచారాలతో గ్రామస్తులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. అవసరమైతే మరోసారి వచ్చి అందరినీ కలుస్తానని అన్నారు.

బండి సంజయ్‌కి సన్మానం

ధర్మపురి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ని ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేటలో బుధవారం జరిగే బహిరంగ సభకు వెళ్తున్న ఆయనను రాయపట్నం జాతీయ రహదారి వద్ద బీజేపీ జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకుడు లవన్‌కుమార్ తదితరులు కలిసి స్వాగతం పలికారు. బండి సంజయ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

ముంపు ప్రాంతాన్ని పూడ్చేస్తున్నారు..!

- నిబంధనలకు విరుద్ధంగా భూములు చదును చేస్తున్నారు


ముంపు ప్రాంతంలో చదును చేసిన భూములు

జగిత్యాలరూరల్: తిమ్మాపూర్ గ్రామ శివారులోని తిప్పన్నపేట ముప్పాల చెరువు ముంపు ప్రాంతం ఎగువన నెల రోజులుగా టిప్పర్ల ద్వారా మట్టి తరలిస్తున్నారు. ముంపు ప్రాంతాన్ని చదును చేస్తున్నారు. ఈ విషయంపై గ్రామస్తులు రెవెన్యూ, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.

ప్రభుత్వ పనులకు అనుమతి..

జిల్లా కేంద్రంలో కొన్ని ప్రభుత్వ నిర్మాణ పనులకు మైనింగ్ శాఖ ద్వారా అనుమతి తీసుకున్న కొందరు కాంట్రాక్టర్లు.. రెండు నెలలుగా మట్టి తరలిస్తున్నారు. ఇదే అదనుగా రాత్రివేళ చెరువు ముంపు ప్రాంతాల్లోని భూములకు తరలిస్తున్నారు. అక్కడ ఆ మట్టి పోస్తూ భూములు చేస్తున్నారు. ప్రభుత్వ పనులకు తీసుకున్న అనుమతిని అధికారులకు చూపిస్తూ.. పెద్దఎత్తున మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ శివారులోని ముప్పాల చెరువు ముంపు ప్రాంతంలో అక్రమంగా మట్టి పోసి చదును చేసిన వ్యక్తులపై చర్యలు చేపడతాం. అక్రమ రవాణాపై కూడా మైనింగ్ అధికారులకు సమాచారం అందిస్తాం.
– నవీన్, తహసీల్దార్, జగిత్యాలరూరల్

కొండగట్టు చోరీ నిందితులపై పీడీయాక్ట్ నమోదు


పీడీయాక్ట్ ఉత్తర్వులు అందజేస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం/కొండగట్టు/చొప్పదండి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీఆంజనేయస్వామి దేవస్థానంలో కొద్దినెలల క్రితం స్వామివారి ఆభరణాలు, వెండి చోరీ చేసినవారిపై బుధవారం పీడీయాక్ట్ అమలు చేశారు. కర్నాటక రాష్ట్రానికి చెందిన రాంశెట్టి యాదవ్, బాలాజీ రాథోడ్, విఠల్‌రావుపై పీడీయాక్ట్ కేసు నమోదు చేసిన ఉత్తర్వుల కాపీని మల్యాల సీఐ కోటేశ్వర్, ఎస్సై అశోక్.. చర్లపల్లి జైలులో ఉన్న నిందితులకు అందజేశారు.

వైభవంగా దీపోత్సవం



జగిత్యాల: జిల్లా కేంద్రంలోని శ్రీ శ్రీనివాస ఆంజనేయ భవాని శంకర దేవాలయంలో బుధవారం వైభవంగా దీపోత్సవం నిర్వహించారు. మహిళలు తొలుత విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. అత్యధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ కూల్చివేతపై ఫిర్యాదు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌లో తన పంట పొలం ఫెన్సింగ్‌ను కూల్చివేశారని రైతు రేపాక బాల్‌నర్సు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత కక్షతో రహదారిని అక్రమించుకునేందుకు ఈ ఫెన్సింగ్‌ను రాత్రివేళల్లో తొలగించారన్నారు. దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని కోరాడు.

'గల్ఫ్‌కార్మికులపై చిన్నచూపు'


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

జగిత్యాలటౌన్: గల్ఫ్ కార్మికుల రెక్కల కష్టంతో గత 9ఏళ్లలో కేంద్ర ప్రభుత్వానికి సుమారు రూ.లక్ష కోట్ల విదేశీ మారకద్రవ్యం సమకూరిందని, పన్నుల రూపంలో రాష్ట్రానికి రూ.పది వేల కోట్ల ఆదాయం వచ్చిందని, అయినా, వారి సంక్షేమానికి ఎవరూ ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయకపోవడం దారుణమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక ఇందిరాభవన్‌లో గల్ఫ్ జేఏసీ నాయకులు బుధవారం కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ, కట్టుకున్న ఆలిని, కన్నవారిని, సొంత ఊరిని వదిలేసి ఉపాధి కోసం గల్ఫ్ వెళ్తున్న కార్మికులు అక్కడ అనేక కారణాలతో అసువులు బాస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. కార్మికుల పిల్లలకు గురుకులాల్లో విద్యాసౌకర్యం కల్పించాలని, గల్ఫ్ నుంచి శాశ్వతంగా తమ స్వస్థలాలకు చేరుకున్న వారిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గల్ఫ్ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం వృథా

- నేడు 'దశాబ్ది దగా' నిరసన
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణకుమార్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి

ధర్మపురి: రాష్ట్రప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరట ప్రజాధనం వృథా చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ విమర్శించారు. సర్కారు తీరుకు నిరసగా గురువారం పట్టణంలో దశాబ్ది దగా నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. స్థానిక కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ధాన్యం అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నానాఇబ్బందులు పడుతున్నారని, ఇదేమీ పట్టని ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు జరుపుకోవడం శోచనీయమన్నారు. కటింగ్‌ల పేరిట మిల్లర్లు దోచుకుంటున్నా మంత్రి కనీసం స్పందించక పోవడం బాధాకరమని అన్నారు. పట్టణంలో తాగునీరు, విద్యుత్ సమస్యలు తాండవిస్తున్నా నిర్లక్ష్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యంగా వెల్గటూర్ మండలం పాశిగామ వద్ద ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమ విషయంలో మంత్రి విషం చిమ్ముతున్నారని మండిపడ్డారు. జీవన్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయమన్నారు. ఎమ్మెల్యేగా, ప్రభుత్వ చీఫ్‌విప్‌గా, మంత్రిగా ధర్మపురి నియోజకవర్గాన్ని ఏం అభివృద్ధి చేశారని డిమాండ్ చేశారు. అభివృద్ధి విషయంలో జీవన్‌రెడ్డికి సవాల్ విసిరిన మంత్రి కొప్పుల ఈశ్వర్ చేసిన సవాల్‌కు మేం సిద్ధమేనని ప్రకటించారు. రోళ్లవాగు విషయంలో కట్ట తెగిపోయి రైతులు పంటలు నష్టపోతే పరిహారం చెల్లించలేదని, రూ.60 కోట్ల వ్యయంతో ప్రారంభించిన రోళ్లవాగు పనులు రూ.130 కోట్లకు ఎలా పెరిగిందో మంత్రి చెప్పాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు ఎస్.దినేశ్, వేముల రాజు, సింహరాజు ప్రసాద్, కుంట సుధాకర్, సీపతి సత్యనారాయణ, సుముఖ్, అశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి కోసం ఠాణా మెట్లు ఎక్కిన వృద్ధుడు

- న్యాయం చేయాలని ఎస్సైకి వేడుకోలు


ఎస్సై నాగరాజుకు సమస్యలు వివరిస్తున్న చంద్రగిరి రాముగౌడ్

వేములవాడరూరల్: రోజురోజుకూ భూముల ధరలు పెరుగుతుండటంతో పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా స్థలాల గొడవలు పెరుగుతున్నాయి. తుదకు ఎన్నో ఏళ్లుగా రహదారిగా ఆ ప్రాంతం గుండా నడవొద్దని అడ్డు వేయడంతో ఆ వృద్ధుడు ఏమి చేయలేక న్యాయం కోసం ఠాణా మెట్లు ఎక్కాడు. వేములవాడరూరల్ మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన చంద్రగిరి రాముగౌడ్ కొన్నేళ్లుగా తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లేవాడు. ప్రస్తుతం ఆ రహదారి ఇప్పుడు లేదని సదరు భూమి యజమానులు అభ్యంతరం చెప్పడంతో రహదారి కోసం ఆ వృద్ధుడు గ్రామంలో అందరికీ విన్నవించుకున్నాడు. ఎవరూ న్యాయం చేయకపోవడంతో ఇక పోలీసులపై ఉన్న నమ్మకంతో బుధవారం వేములవాడరూరల్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చాడు. వృద్ధ వయస్సుతో పాటు వికలాంగుడిగా ఉన్న ఆయన స్టాండ్ సాయంతో ఠాణా మెట్లు ఎక్కాడు. వృద్ధుడి రాకను గమనించిన ఎస్సై నాగరాజు పెద్ద మనిషిని లోనికి పంపించండి అంటూ అనుమతులు ఇచ్చాడు. ఎండలో వచ్చిన అతడికి మంచినీళ్లు, టీ ఇచ్చి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీకు రుణపడి ఉంటా సారూ.. నాకు గ్రామంలో న్యాయం జరగడం లేదు.. ఎన్నో ఏళ్లుగా ఉన్న రహదారిని ఇప్పుడు కాదంటున్నారంటూ ఎస్సైని వేడుకున్నాడు. దీనికి స్పందించిన ఎస్సై వెంటనే మీ గ్రామానికి వచ్చి విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో వెళ్లిపోయాడు. గతంలో ఎలాంటి గొడవలు జరిగినా పోలీస్‌స్టేషన్‌కు రావాలంటేనే భయపడే ఆ రోజుల్లో నేడు ఏ సమస్యలైనా పోలీసులు సహాయం చేస్తారనే నమ్మకం ప్రజల్లో కలగడంతోనే వారు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి విన్నవించుకుంటున్నారు.

తుపాకులతో బెదిరించిన వ్యక్తులపై కేసు

బోయినపల్లి(చొప్పదండి): కులం పేరుతో దూషించి, తుపాకులతో బెదిరించిన వ్యక్తులపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బోయినపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మామిడి మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతపల్లి గ్రామానికి చెందిన మల్లాపుర కమల వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తోంది. ఈనెల 15న ఆమె ఇంట్లో ఉన్న సమయంలో కరీంనగర్‌కు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, అనంతపల్లికి చెందిన ధర్మయ్య, అతడి అనుచరులు వి షాంత్, సాయిలతో పాటు గుర్తు తెలియని మరో ఆరుగురు కమల ఇంటిపై దాడికి వచ్చి కుర్చీలు ధ్వంసం చేసి కులం పేరుతో దూషించారు. మీ కొడుకు చందు ఎక్కడ ఉన్నాడంటూ రెండు తుపాకులతో కమలను, ఆమె భర్తను బెదిరించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చంపుతానని బెదిరించిన వ్యక్తిపై..

వీర్నపల్లి: మండలంలోని బంజేరు గ్రామానికి చెందిన తుడం దేవవ్వను బెదిరించిన తుడం గణేశ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎ స్సై నవత తెలిపారు. దేవవ్వ భూమిలోనికి గణేశ్ అ క్రమంగా చొరబడి దూషిస్తూ చంపుతానని బెది రించాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వరద కాలువ కోసం భిక్షాటన


పట్టణంలో భిక్షాటన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

కోరుట్ల: పట్టణంలోని మద్దులచెరువును అనుసంధానిస్తూ వరద కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం పట్టణంలో భిక్షాటన చేశారు. వర్షాకాలంలో చెరువునిండి ఆ వరద నీటితో 10, పదకొండో వార్డులు ముంపునకు గురవుతున్నాయని తెలిపారు. తక్షణమే వరద కాలువ నిర్మాణం చేపట్టాలని కోరుతూ 11వ వార్డు కౌన్సిలర్ దాసరి సునీత, పదో వార్డు బీజేపీ ఇన్‌చార్జి దాసరి శేఖర్ ఆధ్వర్యంలో భిక్షాటన చేశారు. మున్సిపల్ కౌన్సిల్ పట్టించుకోవటం లేదని, అందుకే భిక్షాటనతో నిధులు సేకరిస్తున్నామని వారు తెలిపారు. మరికొన్ని నిధులు మున్సిపల్ కౌన్సిల్ విడుదల చేసి చెరువు నీళ్ల కోసం వరద కాలువ నిర్మించాలని వారు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్‌లు మాడవేని నరేశ్, పెండెం గణేశ్, నాయకులు బల్మూరి మురళి, ఇందూరి తిరుమల, పోతుగంటి శ్రీనివాస్‌గౌడ్, గిన్నెల అశోక్, బింగి వెంకటేశ్, వాసాల నవీన్, వినయ్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ దోపిడీకి యత్నించిన దొంగ అరెస్ట్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేడీసీసీ బ్యాంకులోకి చొరబడి దోపిడీకి యత్నించిన దుమాల గ్రామానికి చెందిన పిల్లి చందును బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ప్రేమ్‌దీప్ తెలిపారు. బ్యాంక్‌లో దోపిడీకి యత్నించిన చందును 24 గంటల వ్యవధిలో పట్టుకున్నామని అన్నారు. దొంగతనంపై పూర్తిస్థాయి విచారించి కోర్టులో హాజరుపర్చగా 15 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించినట్లు తెలిపారు. ఎవరైనా అపరిచిత వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే వారు తప్పకుండా తగిన జాగ్రత్తలతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.